క్లుప్తంగా

సేవాదృక్పథం కలిగి ఉండాలి



గురజాల: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి సేవా భావంతో ముందుకు సాగాలని నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ అన్నారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం అన్న దానం నిర్వహించారు. కమిషనర్ భోజనం వడ్డించారు. స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం, బండి రవికుమార్ కనకం హనుమంతరావు పాల్గొన్నారు.

వీఆర్వో సంఘం అధ్యక్షుడిగా మల్లికార్జునరెడ్డి



వెల్దుర్తి: మండల వీఆర్ఓల సంఘం అధ్యక్షుడిగా బి.మల్లికార్జునరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురజాల డివిజినల్ వీఆర్ఓల సంఘం అధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వీఆర్ఓల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా బి.మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎస్.కొండలరావు, సంయుక్త కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, కోశాధికారిగా దుర్గా భవానితో పాటు కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. వీరిని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



గురజాల రూరల్: రథ సప్తమి వేడుకలు మంగళవారం దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు సూర్యభగవానున్ని స్మరించుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు.

వైభవోపేతంగా నగర సంకీర్తన



గురజాల: రథ సప్తమిని పురస్కరించుకుని పట్టణంలోని మహిమానిత్వ శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నగర సంకీర్తన వైభవోపేతంగా మంగళవారం నిర్వహించారు. దేవాలయం వద్ద నుంచి శివదీక్ష స్వాములు పార్వతి పరమేశ్వరుల ప్రతిమలను చేతబూని నగర సంకీర్తనలో పాల్గొన్నారు. మహిళలు స్వామి వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సద్ది కమిటీ సభ్యులు ఉన్నారు.

తహసీల్దారుకు సన్మానం




మాచర్ల రూరల్: తహసీల్దార్ డి.కిరణ్‌కుమార్‌కు అవార్డు రావడం ఆనందకరమని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉత్తమ అవార్డు అందుకున్న కిరణ్‌కుమార్‌ను సన్మానించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవిన్యూ సేవలను అందిస్తున్న కిరణ్ కుమార్ ప్రతిభను గుర్తించి అవార్డు అందించారన్నారు. నాయకులు కందుల రవికుమార్, కె.జ్యోతి, కె.చిన్ని, నాగెండ్ల దశరథ రామయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. ప్రమాదంలో రెంటచింతలకు చెందిన బాపనపల్లి నాగసురేంద్ర (31) మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై పాపారావు వివరాల ప్రకారం.. రెంటచింతల నుంచి దాచేపల్లికి నాగసురేంద్ర, మాదాసు సాగర్ ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. నడికుడి గ్రామ సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదవ శాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన నాగ సురేంద్ర ఘటనా స్థలంలో మృతి చెందాడు. సాగర్‌కు తీవ్రగాయాలు అవడంతో నరసరావుపేటకు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఎస్సై పాపారావు పరిశీలించి మృతుని కుటుంబ సభ్యుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

తప్పని తాగునీటి కష్టాలు

- మంచినీటి సరఫరా పథకానికి మరమ్మతులు
- గ్రామాలకు అందని తాగునీరు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- బుగ్గవాగు రిజర్వాయర్ సమృద్ధిగా నీరు
- వేసవి తాపం వచ్చేస్తోంది.. స్పందించాలంటున్న ప్రజలు



బుగ్గవాగు రిజర్వాయర్



నీటితో కళకళలాడుతున్న బుగ్గవాగు రిజర్వాయర్

దుర్గి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని.. అన్న చందంగా తయారైంది ప్రజల పరిస్థితి. బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి నీరు సరఫరా అవుతున్నా.. మంచినీరు సరఫరా చేయాల్సిన పథకం ఆగిపోవడంతో తాగు నీటి కోసం గ్రామీణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామం వద్ద కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన తాగునీటి సరఫరా పథకాన్ని నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ పథకం మరమ్మతులు గురైనప్పటికీ పట్టించుకునే నాథుడు లేడు.

పనిచేయని ఫిల్టర్లు

గత సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడం, నాగార్జున సాగర్‌లో పూర్తి స్థాయిలో నీటి నిల్వలుండటంతో అక్కడ నుంచి బుగ్గవాగు రిజర్వాయర్‌కు సరఫరా చేశారు. దాదాపు 3.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ ఆర్‌డబ్ల్యూఎస్, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోకపోవటంతో నీటి సరఫరా పథకం నిలిచిపోయింది. భారీ స్థాయిలో నిర్మించిన 3 ఫిల్టర్లలో సరైన ఇసుక లేకపోవడంతో స్వచ్ఛమైన నీరు సరఫరా కావడం లేదు. నిపుణుల అంచనా ప్రకారం ఒక్కొక్క ఫిల్టర్‌కు దాదాపు 12 లారీల ఇసుక అవసరముంది. ఒక్కొక్క లారీకి సుమారుగా 40 టన్నుల కెపాసిటీ గల ఇసుక అవసరం.

నీటికి తప్పని ఇక్కట్లు

ఏటా టెండర్ల ప్రక్రియ ద్వారా ఈ పథకాన్ని కాంట్రాక్టర్లు రూ.40 నుంచి రూ.50 లక్షలకు కైవసం చేసుకుంటారు. ఈ స్కీం పరిధిలోని మండల కేంద్రమైన దుర్గితో పాటు ధర్మవరం, ఓబులేశునిపల్లె, కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా కాకపోవడంతో.. ఆయా గ్రామాల్లోని మినరల్ వాటర్ ప్లాంట్లకు డబ్బులు వెచ్చించి నీటిని కొనుక్కునే దుస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా ప్లాంటు యజమానులు తమకి నచ్చిన విధంగా నీటిని సరఫరా చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సరఫరాకు అంతరాయం లేకుండా ప్రజలకు తాగు నీరందించాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన ఫిల్టర్ బెడ్..

త్వరితగతిన చర్యలు తీసుకోవాలి



రిజర్వాయర్ అందుబాటులో ఉంది. మంచి నీటికి ఇబ్బంది లేకుండా ఉందనుకున్నాం. కానీ, మరమ్మతులతో నీటి సరఫరా స్కీం ఆగిపోవడం చాలా ఇబ్బందిగా మారింది. స్వచ్ఛమైన నీరు ప్రతి ఇంటికి అందే విధంగా సంబంధిత శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– గుండాల వెంకటేశ్వర్లు, ధర్మవరం

టీడీపీ ఫ్లెక్సీల తొలగింపు



టీడీపీ ఫ్లెక్సీలు సిబ్బందితో తొలిగిస్తున్న ఎంపీడీఓ సరోజినిదేవి



ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

సాక్షి ఎఫెక్ట్

రెంటచింతల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ స్థానిక మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారి వెంబడి టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై సాక్షిలో ఈ నెల 4న వార్తాకథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ కె.సరోజినిదేవి ఫ్లెక్సీల తొలిగింపు చర్యలు మంగళవారం చేపట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారుల దృష్టిలో అందరూ సమానమేనన్నారు. ఇప్పటికే గ్రామాలలోన్ని రాజకీయ నాయకుల విగ్రహాలు కన్పించకుండా పట్టలతో కప్పించామన్నారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు గ్రామాల్లో రాజకీయ పరమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ గాదె శ్రీనివాసరావు, గ్రా కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు ఉన్నారు.

కనుల పండువగా భావనా రుషి స్వామి కల్యాణం



అలంకరణలో స్వామి వార్లు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

గురజాల: చర్లగుడిపాడు గ్రామంలోని భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. రథ సప్తమి పండుగను పురస్కరించుకుని పద్మశాలీయుల ఆధ్వర్యంలో స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆలోచనతో శాంతి కల్యాణం నిర్వహించారు. వేకువ జాము నుంచే స్వామి వారికి సుప్రభాత సేవ, పుణ్యావచనం, అనంతరం దేవాలయంలో ఉన్నటువంటి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టా బంగారంను దేవాలయంలో కొలువైన స్వామి వారి వద్ద ఉంచారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివార్లను ఉంచి మత్రోచ్చరణ మధ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా భావనా రుషి స్వామి కల్యాణం

మాచవరం: మండల కేంద్రంలోని పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనా రుషి స్వామి వారి 45వ కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన అధ్యక్షుడు పులిపాటి చిన భాస్కరరావు ఆధ్వర్యంలో గ్రామంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. వేద మంత్రోచ్చారణలతో కల్యాణం నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం



పాస్టర్ కుటుంబానికి డబ్బులు అందజేస్తున్న నాయకులు

మాచర్ల: పట్టణంలోని 5వ వార్డులో సుద్దగుంతల ప్రాంతంలో నివాసముంటూ అనారోగ్యానికి గురైన చర్చి పాస్టర్ బంకా యాకోబుకు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. కౌన్సిలర్ మాచర్ల సుందరరావు, ఎస్సీ మహిళా విభాగం జిల్లా నాయకురాలు బూదాల మరియమ్మ, కౌన్సిలర్ మందా సంతోష్, ఎస్సీ సంఘ నాయకుల ఆధ్వర్యంలో పాస్టర్ బంకా యాకోబు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ రాబోయే రోజుల్లో పీఆర్కే కుటుంబం పాస్టర్ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. కౌన్సిలర్ మందా సంతోష్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు మందా సంతోష్, బొంగురు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో వైభవంగా పల్నాటి వీరాచారం



గ్రామోత్సవంలో పల్నాటి వీరుల ఆయుధాలు



పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవను సన్మానిస్తున్న సత్తుపల్లి వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో అనాదిగా కొనసాగుతున్న వీరాచారాన్ని పొరుగు రాష్ట్రం తెలంగాణాలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సోమవారం వైభవంగా నిర్వహించారు. పల్నాటి వీరుల ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేసి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కారెంపూడి నుంచి పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకులు విజయ్‌కుమార్ వెళ్లి పల్నాటి వీరుల ఆయుధాలకు చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధాలకు పూజ కట్టారు. అనంతరం వీరుల ఆయుధాలతో గ్రామోత్సవం నిర్వహించి పల్నాటి వీరుల ఆరాధన చేశారు. సత్తుపల్లిలో పల్నాటి వీరుల ఔన్నత్యాన్ని చాటారు. సత్తుపల్లి వీధులు పల్నాటి వీరుల ఆయుధాలతో కనుల పండవ చేశాయి. సత్తుపల్లిలోని పల్నాటి వీరాచారులు చాలా కాలంగా వీరాచారాన్ని పాటించడం మానేశారు. ఈ క్రమంలో పల్నాటి వీరుల ఆయుధాలు (దైవాలు)కు కొలుపులు చేయాలని వారు సంకల్పించి పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఆశీస్సులు సూచనలతో పల్నాటి వీరాచారాన్ని నెరవేర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పల్నాటి వీరాచారులు కొలుపుల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా, ఖమ్మం జిల్లా, భధ్రాద్రికొత్తగూడెం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి తదితర జిల్లాల నుంచి 100కు పైగా పల్నాటి వీరుల ఆయుధాలతో వీరాచారులు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారని పీఠాధిపతి తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతిని వీరాచారులు ఘనంగా సన్మానించారు. చీపు చెన్నయ్య ప్రాంగణంలో నాగుల నాగేశ్వరరావు, చీపు గంగాధర్, మరికంటి సత్యనారాయణ, కేవీఎల్వి శ్రీనివాసరావు తదితరులు వీరాచార నిర్వహణలో పాల్గొన్నారు.

ఖోఖో విన్నర్స్‌కు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న హెచ్ఎం అనంత శివ, ఉపాధ్యాయులు

కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. బాలోత్సవం సందర్భంగా వడ్డమూడి విజ్ఞాన్ కాలేజీలో ఈ నెల 1వ తేదీ వరకు జరిగిన ఖోఖో క్రీడల్లో పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఖోఖో అండర్ 14, అండర్ 17 రెండు విభాగాల్లో కూడా పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. హెచ్ఎం అనంత శివ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీలు జె.శ్రీనివాసరావు, స్వర్ణరాజును అభినందించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

మాచర్ల రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా పట్టణ, పల్లెల్లో ప్రవేశం లేదని రూరల్ ఎస్ఐ పి.రవిబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం రాయవరం జంక్షన్‌లో హెల్మెట్ల వాడకంపై అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రఫి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లవరంలో రీసర్వే ప్రారంభం



రెంటచింతల: మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో 4 బృందాలతో మంగళవారం భూ రీసర్వే ప్రారంభించినట్లు డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య తెలిపారు. గ్రామానికి చెందిన రైతుల భూముల వద్దకు రీసర్వే బృందాలు వెళ్లి.. రైతులు చెప్పిన హద్దుల పరిధిలోని భూములను సర్వే నంబర్ల ఆధారంగా యంత్ర పరికరాలతో కొలతలు వేసి, డేటా ఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే.. సమస్యను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకు మండలంలోని పశర్లపాడు, దామరపాడు, మిట్టగుడిపాడు గ్రామాల్లో 100 శాతం భూ రీసర్వే పూర్తి చేశామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని స్థానిక బాలయోగి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల తెలిపారు. మంగళవారం పాఠశాల విద్యార్థినులతో కలిసి క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ మేరీ మంజుల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చునన్నారు.

కందిచేను దహనం చేసిన దుండగులు



పొలంలో కంది పంట దహనం అనంతరం మిగిలిన బూడిద

విజయపురిసౌత్: రెండు ఎకరాల కంది చేనును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన మాచర్ల మండలం హస్నాబాద్ తండాలో మంగళవారం చోటు చేసుకుంది.బాధితుడు కేతావత్ రతన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం గత జులై నెలలో రెండు ఎకరాల కందిచేను వేసి సాగు చేశాడు. కంది చేను చేతికి రావడంతో కంది మొక్కలను కోసి కట్టలుగా వేశాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు కంది చేనును దగ్ధం చేయడంతో మాచర్ల ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు. విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు కేతావత్ రతన్ నాయక్ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న సీఐలు వెంకట్రావు, భాస్కర్

నకరికల్లు: రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి వేగంగా ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని శాంతినగర్ వద్ద మంగళవారం జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం నరసరావుపేట నుంచి దేచవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రభాకర్ శాంతినగర్ గ్రామం వద్ద పెట్రోల్ బంకులోకి వెళ్లేందుకు వాహనాన్ని కుడి పక్కకు తిప్పాడు. వెనుక నుంచి అటువైపే వస్తున్న దేచవరం గ్రామానికి చెందిన నాలి శివ ద్విచక్ర వాహనంతో ఢీ కొన్నాడు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై ఇరువైపులా పడిపోయారు. పల్నాడు జిల్లా ఎస్పీని కలిసేందుకు నరసరావుపేట వెళ్తున్న పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు, దాచేపల్లి సీఐ భాస్కర్‌లు మార్గం మధ్యలో శాంతినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం చూసి గాయాలతో పడున్న క్షతగ్రాతులను 108 వాహనం వచ్చేందుకు సమయం పట్టడంతో అటుగా వెళ్తున్న ఆటోలో హుటాహుటిన నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. సకాలంలో స్పందించి సేవా తత్పరతను, సమాజం పట్ల బాధ్యతను సీఐలు చాటుకున్నారు.

పంప్‌హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకట నాగరాజు, రెవెన్యూ అధికారులు

క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామం వద్ద జరుగుతున్న గోదావరి పెన్నా అనుసంధాన పనుల్లో భాగంగా పంప్‌హౌస్-3 ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలం సేకరించటానికి ఏర్పాటు చేసిన కమిటీతో తహసీల్దార్ వెంకటనాగరాజు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ వివరిస్తూ 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు కరువు నివారణ ప్రాజెక్ట్ పనులలో భాగంగా పీసపాడు వద్ద పంప్‌హౌస్ పనులు చేపట్టారన్నారు. ఆ తరువాత కాలంలో పనులు ముందుకు సాగలేదన్నారు. మూడవ పంప్‌హౌస్ నిర్మాణానికి రైతుల నుంచి భూములు సేకరించేందుకు కావాల్సిన వివరాలతో విచారించేందుకు కమిటీ వేసినట్లు చెప్పారు. ఆ కమిటీలో తహసీల్దార్‌తోపాటు మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు ఉంటారన్నారు. పంప్‌హౌస్ ఏర్పాటుకు కావాల్సిన భూమి సేకరించేందుకు ఆ ప్రాంతంలోని రైతుల పేర్లు, విస్తీర్ణం, నమోదు చేసుకుని గ్రామ సభ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించిన తరువాత పనులకు సంబంధించిన ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు చేపడతారని తెలిపారు. అందుకోసం క్షేత్రస్థాయిలో మంగళవారం పంప్‌హౌస్‌కు కావాల్సిన భూమి పరిశీలించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శ్రీధర్, వీఆర్వో ఇబ్రహీం, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఏఎన్ఎం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

రాజుపాలెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ఎం కోటిలింగమ్మ కుటుంబ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. కోటిలింగమ్మ కాంట్రాక్ట్ ఏఎస్ఎంగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో స్పందించిన ఆరోగ్య సిబ్బంది పిల్లల చదువుల నిమిత్తం రూ.75 వేల యూనియన్ బ్యాంక్ ఫిక్స్‌డ్ బాండ్‌ను కుమారులకు డాక్టర్ వెంకటకృష్ణకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావులు, సిబ్బంది కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లుట్లలో పొలం పిలుస్తోంది



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏఓ

మాచవరం: మొక్కజొన్న పంటలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని ఏవో కె.రామమ్మ తెలిపారు. పిల్లుట్ల, సింగరాయపాలెం తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పత్తి, మిరప, కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో గొంగళి పురుగు నివారణ చర్యలను వివరించారు. వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు యాకోబు, నరసింహానాయక్ పాల్గొన్నారు.